పల్లెకు రాని వెలుగు

గ్రామీణ ప్రాంత ప్రజల రవాణా సౌకర్యానికి పెద్ద దిక్కుగా ఉన్న రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) సేవలకు పల్లెలకు దూరమయ్యాయి. దీంతో సామాన్య ప్రజలతో పాటు కళాశాల, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేసేదిలేక ప్రమాదమని తెలిసినా ఆటోలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణిస్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోవడం లేదు.

- గ్రామాలకు దూరమైన ఆర్టీసీ బస్సులు
- ప్రజలతో పాటు విద్యార్థుల అవస్థలు
- తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రజలు


పల్లె వెలుగు బస్సు


పరిమితికి మించి ఆటోలో వెళ్తున్న గ్రామీణులు

గుడిబండ: మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా 61 గ్రామ పంచాయతీలు, 315 గ్రామాలు ఉండగా దాదాపు రెండు లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారు. మడకశిర ఆర్టీసీ డిపోలో ఉన్న 33 బస్సుల సర్వీసులు ఉన్నాయి. అందులో విద్యార్థుల కోసం రెండు బస్సు సర్వీసులను నడుపుతున్నారు. దూర ప్రాంతాలకు ప్రయాణించడానికి మూడు లగ్జరీ బస్సులు ఉన్నాయి. నిత్యం వివిధ పనులు కోసం గ్రామాల నుంచి వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. పల్లెలు కావడంతో కొంత మంది వద్ద మాత్రమే కార్లు, ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. మిగతా వారంతా ఇతర వాహనాలపై ఆధారపడాల్సిందే. గతంలో ఆర్టీసీ బస్సులు 75 శాతం గ్రామాల్లో తిరిగేవి. ఈ బస్సుల్లో ప్రయాణించి తమ పనులను చేసుకునేవారు. అయితే నష్టాల పేరుతో ఆర్టీసీ అధికారులు కొన్ని రూట్లలో బస్సులను పూర్తిగా నిలిపివేయడంతో నియోజకవర్గంలో సగానికి పైగా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదు. గతంలో గ్రామానికి రెండు బస్సులు తిరిగేచోట్ల కూడా ప్రస్తుతం ఒక్క బస్సు కూడా లేని పరిస్థితి నెలకొంది.

బస్సు ఎరుగని గ్రామాలెన్నో...

గుడిబండ మండలంలోని గుడ్డదహళ్లి, దేవరహట్టి, కురుబరపల్లి, కొంకల్లు, మద్దనకుంట, తాళికెర, అమరాపురం మండలంలో నాగేనహళ్లి, ద్వావగానహళ్లి, గౌడనకుంట, బంగారుపాళ్యం, రొళ్ల మండలంలో దొడ్డేరి, కొడగారుగుట్ట, బైరేపల్లి, అగళి మండలంలో కదిరేపల్లి, గొల్లరహట్టి, దొక్కలపల్లి, హళ్లికెర తదితర గ్రామాలకు అసలు బస్సు సౌకర్యమే లేదు.

గతంలో కిక్కిరిసేలా...

హిందూపురం డిపోకు చెందిన ఎమ్ రాయాపురం బస్సు సర్వీసు రాయాపురం, మధూడి, రొళ్ల, గుడిబండ, జంబులబండ మీదుగా చాలా గ్రామాలను కలుపుకుని హిందూపురానికి చేరుకునేది. ఎప్పుడూ ఈ బస్సు కిక్కిరిసి ఉండేది. ఉదయాన్నే 5.30 గంటలకు రాయాపురం నుంచి హిందూపురం వైపునకు బయలుదేరేది. ఈ బస్సు సర్వీసును పూర్తిగా నిలిపి వేశారు. దీంతో కళాశాల, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, రైతులు పండించే పండ్లు, కూరగాయలు తీసుకుని మార్కెట్లో అమ్మే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలకు బస్సులు రాకపోవడంతో విద్యార్థులు, ఆటోలు, ట్రాక్టర్లు ఇతర వాహనాల్లో ప్రయాణిస్తున్నారు. ఆటోలో ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా వేరే దారిలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఆటోలే దిక్కు....

ప్రస్తుతం మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎక్కువ మంది ఆటోల్లో ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రమాదాలు జరుగుతున్నా త్వరగా గమ్యం చేరాలనే ఆలోచనతో ఆటోల్లో వెళుతున్నారు. నిబంధనల ప్రకారం ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకుంటే వారిచ్చే డబ్బులు తమకు డీజల్‌కు సరిపోతాయని ఆటో డ్రైవర్లు అంటున్నారు. దీంతో ఒక్కో ఆటోలో పది మంది నుంచి 20 మందికిపైగా ఎక్కించుకుని ఆటోలో తిప్పుతున్నారు. బస్సులు సక్రమంగా రాని కారణంగా ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తుండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కువ మంది ప్రయాణాలు చేయడం వల్ల కొన్ని రోడ్లపై ఆటోలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకుని అన్ని మండలాలకు గతంలో మాదిరిగా ఆర్టీసీ బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మడకశిర నియోజక వర్గం జనాభా	2 లక్షలకు పైగా
గ్రామ పంచాయతీల సంఖ్య	61
గ్రామాల సంఖ్య	315
ఆర్టీసీ బస్సు సర్వీసుల సంఖ్య	33

అందరికీ ఇబ్బందులే...



ఆర్టీసీ బస్సులు చాలా గ్రామాల్లో తిరగడం లేదు. గుడ్డదహళ్లి, జీఎస్ తండా గ్రామాల ప్రజలు ఇంత వరకూ పల్లె బస్సులను చూడలేదు. పల్లెలకు బస్సులు రాని కారణంగా చదువుకునే విద్యార్థులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా ఆలోచించి గ్రామాలకు బస్సులను తిప్పాలి.

– మూర్తి, గుడ్డదహళ్లి, గుడిబండ మండలం

ప్రజల ప్రాణాలు కాపాడాలి



ఆర్టీసీ బస్సులు గ్రామాలకు రావడం లేదు. దీంతో ప్రజలు ఎక్కువగా ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఇలాంటి ప్రయాణం చాలా ప్రమాదకరమని తెలిసినా వేరే దారిలేక ఆటోల్లోనే వెళ్లాల్సివస్తుంది. అధికారులు చొరవ తీసుకుని గ్రామాలకు అవసరమైన ఆర్టీసీ బస్సులను నడిపి ప్రజల ప్రాణాలు కాపాడాలి.

– చిత్తనగిరియప్ప, తాళికెర, గుడిబండ మండలం

క్లుప్తంగా

చార్జీలు పెంచి సంపదను సృష్టిస్తారా?

- వైఎస్సార్‌సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర



పెనుకొండ రూరల్: ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీల పెంచబోమని హామీలు గుప్పించి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం.. అధికారం చేపట్టిన తరువాత ఇచ్చిన హామీలను విస్మరించిందని వైఎస్సార్‌సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర ఒక ప్రకటనలో విమర్శించారు. సీఎం చంద్రబాబు విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల ధరలు పెంచి సంపదను సృష్టిస్తున్నారా? అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన నాయకులు, ఇచ్చిన హామీలకు తూట్లు పొడిచి సామాన్య ప్రజల నడ్డివిరిచారన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే నేడు కూటమి పాలనలో స్కూల్, కాలేజీ ఫీజులు, బియ్యం, పప్పులు, కూరగాయలు రేట్లు కూడా పెరిగాయన్నారు. వీటికి తోడుగా ఇప్పడు విద్యుత్ చార్జీలు కూడా అమాంతంగా పెంచితే ప్రజల ఆదాయం సంగతి పక్కన పెడితే అప్పుల పాలవడం మాత్రం గ్యారంటీ అన్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల మద్దతు ఉందని ఎన్నికలు ఎప్పుడొచ్చినా గెలుపు ఖాయమన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ఓంకార్‌నాయక్

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో ఆదివారం చిత్రదుర్గం యూనిటీ హెల్త్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి రోగుల నుంచి స్పందన లభించింది. చిత్రదుర్గం నుంచి వచ్చిన స్త్రీల వ్యాధి నిపుణురాలు జ్యోతి విజయ్‌కుమార్ 150 మంది రోగులను పరీక్షించి వారికి ఉచితంగా రూ.30 వేలు విలువ చేసే మందులను అందజేశారు. అదే విధంగా పావగడ నుంచి వచ్చిన జనరల్ ఫిజీషియన్ ఓంకార్ నాయక్ 100 మంది రోగులను పరీక్షించి వారికి రూ.10 వేలు విలువ గల మందులను అందజేశారు. వచ్చిన రోగులకు స్థానికులు డాక్టర్ బసవరాజు, రమేష్‌బాబు, అజయ్‌కుమార్, నవ్య తదితరులు తమ సహాయ సహకారాలు అందజేశారు.

ఘనంగా వాల్మీకి జయంత్యుత్సవం


జ్యోతులు మోస్తున్న మహిళలు

పావగడ: తాలూకాలోని సీహెచ్ పాళ్య గ్రామంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నిడుగల్ వాల్మీకి ఆశ్రమాధిపతి వాల్మీకి సంజయ కుమార స్వామి జీ వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మీకులు విద్యా వంతులుగా ఎదిగి ప్రయోజకులు కావాలన్నారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. వాల్మీకి చిత్రపటాన్ని గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగించారు. మహిళలు జ్యోతులు మోశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

గోరంట్ల: ఉపాధ్యయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి జిల్లా నాయకులు దామోదరరెడ్డి తదితరులు విన్నవించారు. ఆదివారం అనంతపురంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పీఆర్‌టీయూ నాయకులు దామోదరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి తదితరులు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డికి విన్నవించారు.

మోడల్ పరీక్ష ఉపయుక్తం


మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మడకశిర: పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనానికి సంబంధించిన ఎన్ఎంఎంఎస్ మోడల్ టెస్టను నిర్వహించారు. ప్రశ్న పత్రాలను స్థానిక ఎంఈఓ భాస్కర్, హరేసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సునీత విడుదల చేశారు.

అగళి: పరీక్షలంటే విద్యార్థులకు భయం ఉంటుందని, ఆ భయం మోడల్ పరీక్షల ద్వారా తొలగిపోతుందని ప్రధానోపాధ్యాయుడు వరదరాజు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ మోడల పరీక్షలు నిర్వహించారు. మండలంలోని 8వ తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

చంద్రబాబు మళ్లీ మాట తప్పారు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ చార్జీల విషయంలో మాట తప్పారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలను పెంచనని అనేక సభల్లో చంద్రబాబు ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. అయితే చంద్రబాబు ఇచ్చిన హామీని మరచిపోయి విద్యుత్ చార్జీలను పెంచారని విమర్శించారు. విద్యుత్ చార్జీలను భారీగా పెంచి వినియోగదారుల నడ్డి విరిచిన ఘనడు చంద్రబాబన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరొక మాట చెప్పడం చంద్రబాబు నైజమని ఎద్దేవా చేశారు. 5 నెలల కాలంలోనే చంద్రబాబు ప్రజలపై అనేక రకాలుగా రూ.వేల కోట్లకుపైగా భారం మోపారన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు అనవసరంగా విద్యుత్ చార్జీల విషయంలో తప్పుడు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్లపై కూడా తప్పుడుగా ప్రచారం చేసి నేడు మాత్రం స్మార్ట్ మీటర్లను ఎందుకు అమరుస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. పెంచిన విద్యుత్ చార్జీలను పూర్తిగా ఉపసంహరించుకోవాలని లేకపోతే ప్రజలు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి దిగడం ఖాయమన్నారు.

నేరాలు చేస్తే చర్యలు


రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న సీఐ రాఘవన్

పెనుకొండ: నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సీఐ రాఘవన్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం రౌడీషీటర్లు, పాత నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. గొడవలకు వెళ్లినా, సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సత్ప్రవర్తనతో నడుచుకుంటూ ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని కోరారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను సమూలంగా నిర్మూలిద్దాం




హిందూపురం: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ , మడకశిరలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రొళ్ల: ఎయిడ్స్ మహమ్మారిని సమూలంగా నిర్మూలిద్దామని సీహెచ్‌సీ డాక్టర్ సాయికులదీప్, ఐసీటీసీ కౌన్సిలర్ అంజినప్ప, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ తదితరులు పేర్కొన్నారు. ఆదివారం రొళ్ల ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లతో పాటు స్వచ్ఛంత సంస్థ సభ్యులతో కలిసి అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా గ్రామ పురవీధుల గుండా అవగాహన ర్యాలీ చేట్టి వైఎస్సార్ సర్కిల్ ఆవరణలో మానవహారం నిర్వహించారు.

హిందూపురం టౌన్: సమాజంలో ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపకూడదు. వారికి ఆసరానిద్దామని సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాలులో న్యాయసేవా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ముస్లిం శాంతి సామరస్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా సీనియర్ సివిల్ జడ్జితో పాటు సీఐలు రాజగోపాల్ నాయుడు, కరీం బాషా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇందాద్ పాల్గొన్నారు. ఎయిడ్స్ బారిన పడిన చిన్నారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. అలాగే ఎయిడ్స్ బాధితులకు దాతలు చీరలు, ప్యాంట్ షర్ట్‌లు, కంబళ్ళు, స్వెటర్లు, విద్యార్థులకు నోట్ బుక్‌లు, పండ్లు, పౌష్టికాహారం, భోజనంను అందించారు. దాతలు ఏసీ నాగరాజు, మంచాల మారుతి, వెంకటస్వామి, నరేంద్ర, షబ్బీర్, సాధిక్, అజ్మతుల్లా ఖాన్, ఉబెదుల్లా హుస్సేన్, హాజీ నాసిర్, అజ్మతుల్లా ఖాన్, ఇందాద్‌లకు సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, సీఐల చేతుల మీద మానవతా మూర్తి పురస్కారం అందించారు.

మడకశిర: ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా వైద్యారోగ్యశాఖ, ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ వలన కలిగే అనర్థాలు, నష్టాలను ప్రజలకు వివరించారు. ఏరియా ఆస్పత్రి డాక్టర్ నేహ, ఫోర్డ్ డైరెక్టర్ బదరీష, ఏఎస్ఐ బాలాజీ , ప్రాజెక్ట్ మేనేజర్ అశ్వత్థనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: ఎయిడ్స్ దినోత్సవంలో భాగంగానే బాలాజీ కళాశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలను ప్రిన్సిపాల్ డాక్టర్ వీరభద్రప్ప తెలియజేశారు. కార్యక్రమంలో హాస్టల్ ఇన్‌చార్జి శివప్రసాద్‌రెడ్డి, పుష్పలత, వైస్ ప్రిన్సిపాల్ గోపాల్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

కార్తీక మాసం ముగింపు సందర్భంగా ఆదివారం హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

– సాక్షిబృందం


హిందూపురం: రాఘవేంద్రస్వామి ఆలయంలో లక్షదీపార్చన


లేపాక్షి: అలంకరణలో వీరభద్ర స్వామి


హేమావతిలో సిద్ధేశ్వరస్వామి


గుడిబండ: వీరభద్రస్వామి ఆలయంలో ...

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్


సోమందేపల్లి: కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: గ్రామస్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం నాగినాయని చెరువు గ్రామంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలు అంటూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఉండి ఉంటే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేవన్నారు. ఆరు నెలలు కాలంలోనే అసమర్థ కూటమి ప్రభుత్వం ఎప్పుడూ పోతుందా అని ప్రజలు ఆలోచన చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. నాగినాయని చెరువు తండా అధ్యక్షుడిగా రాము నాయక్, ఉపాధ్యక్షుడిగా శీనానాయక్, యువజన విభాగానికి శ్రీనివాస్‌నాయక్, రైతు విభాగానికి తిప్పానాయక్, మహిళా విభాగం దేవీబాయి, సోషియల్ మీడియాకు సేవా నాయక్, కార్యదర్శిగా నారాయణ నాయక్లను ఎంపిక చేశారు. అలాగే బుసయ్యగారిపల్లి అధ్యక్షుడిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా అశ్వర్థప్ప, బీసీ సెల్‌కు సురేష్, యువజన విభాగానికి నరేంద్ర నాయక్, మహిలా విభాగానికి ఆదిలక్ష్మమ్మ, రైతు విభాగానికి శ్రీరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సోమశేఖర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు గజేంద్ర, శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, వైస్ ఎంపీపీ వెంకటనారాయనరెడ్డి, సర్పంచ్ అంజి నాయక్, న్యాయవాది విశ్వనాథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


టీ కొట్టు నిర్వాహకుడితో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

పెనుకొండలో 'కాఫీ విత్ పీపుల్ '

పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, నియోజకవర్గ సమన్వయకర్త , మాజీ మంత్రి పెనుకొండ పట్టణంలో కాఫీ విత్ పీపుల్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగానే ఆదివారం పట్టణంలోని మెయిన్ బజార్, పోస్ట్ ఆఫీస్ సర్కిల్‌లో ప్రజలతో మమేకమయ్యారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు వాటి అమలుపై ప్రజల స్పందనను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కన్వీనర్లు నరసింహులు, సుధాకర్‌రెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, నాయకులు వైశాలి జయశంకర్‌రెడ్డి, గణప్ప, కిష్టా, యాసిన్, శేషాద్రి కొండలరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దత్త జయంతి నిర్వహణకు భిక్షాటన

పెనుకొండ: పట్టణంలో పలువురు షిర్డీసాయి, సత్యసాయి భక్తులు దత్త జయంతిని పురస్కరించుకుని పట్టణంలో ఆదివారం భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు ఆలపిస్తూ పట్టణంలో పలు వీధుల్లో తిరుగుతూ భిక్షాటన చేస్తూ వచ్చిన సరుకులను షిర్డిసాయి బాబా ఆలయానికి చేర్చారు. ఈ నెల 14న దత్త జయంతి నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు.

నేడు చేపల చెరువు వేలం

గుడిబండ: మండల పరిధిలోని ఫళారం చెరువులో చేపలు పెంపకానికి సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు గ్రామ సచివాలయ ఆవరణంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ నాగరాజు నాయక్ తెలిపారు. ఆసక్తి కలవారు రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

చింతతోపు వేలంపాట రేపు

అగళి: మండల పరిధిలోని గ్రామ సచివాలయం వద్ద 3వ తేదీ మంగళవార ఇనగలూరు, 4న ఆర్‌జీ పల్లి, 5న ఇరిగేపల్లి, 6న అగళిలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రంగనాథ తెలిపారు. ఈ బహిరంగ వేలం పాటలో పాల్గొనేవారు రూ.3 వేలు చెల్లించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

నూతన కమిటీల ఎంపిక

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మండల మాల మహానాడు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా విరుపసముద్రం నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడిగా ఉదుగూరు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా హేమావతి కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శిగా నిద్రగట్ట సంతోష్, కోశాధికారిగా అమరాపురం నాగరాజు, ప్రధాన సలహాదారులుగా వలస చంద్రశేఖర్, పరమేష్, గౌడనకుంట శ్రీనివాస్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

ఎంప్లాయీస్ వెల్ఫేర్ కమిటీ

మండల ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడిగా వెంకటేష్, అధ్యక్షుడిగా ఆర్.తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శిగా సి.తిప్పేస్వామి, సంయుక్త కార్యదర్శిగా పుల్లీకుంట మల్లికార్జునలను ఎంపిక చేశారు.

రేపు ఎస్ఎంయూ సమావేశం

మడకశిర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎస్ఎంయూ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు స్థానిక నాయకులు రామకృష్ణ, జయసింహ, పురుషోత్తం, ముద్దప్ప తెలిపారు.

డ్రిప్ వాడకంపై అవగాహన

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది పంచాయతీలో ఆదివారం ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో రైతులకు డ్రిప్, స్ప్రింకర్ల వాడకంపై ఎంఐఓ నరసింహప్ప అవగాహన కల్పించారు.

నలిగానహళ్లిలో కాంగ్రెస్ విజయభేరి

పావగడ: తాలూకాలోని నలిగానహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ మద్దతుదారుడు జి ఆర్ లింగనాయక ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు లింగనాయకను గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు నాగయ్య తదితర కాంగ్రెస్ సభ్యులు ఘనంగా సన్మానించి అభినందించారు.

అక్రమ మద్యం ధ్వంసం

పావగడ: తాలూకా వ్యాప్తంగా స్థానిక ఎక్సైజ్ , పోలీస్ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యాన్ని తహసీల్దార్ వరదరాజు సమక్షంలో ఆదివారం ధ్వంసం చేశారు. స్థానిక గార్బేజ్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఎక్సైజ్ సీఐ మైఖేల్ జార్జ్ పర్యవేక్షించారు.

మోతీరామ్‌నాయక్‌కు ఘన నివాళి


మోతీరామ్‌నాయక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప

రొళ్ల: మండల పరిధిలోని ఆవినకుంటతండా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు, రైతు మోతీరామ్‌నాయక్ శనివారం ట్రాక్టర్ తిరగబడి మృతి చెందిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజుతో పాటు మడకశిర మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ జయరామప్ప, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సంతోష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు మృతుని స్వగ్రామానికి చేరుకొని మోతీరామ్‌నాయక్ భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ ఆయన చేసిన సేవలను ఈరలక్కప్ప కొనియాడారు. ఆర్థికంగా సహాయ సహకారాలు అందించడానికి తనవంతు కృషి చేస్తామన్నారు.